# పటేల్ రమేష్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన రాజేష్ ముదిరెడ్డి

పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 28:అమెరికా విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకొని బుధవారం మాతృదేశానికి తిరిగి వచ్చిన పీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెన్ పహాడ్ మండల ముద్దుబిడ్డ రాజేష్ ముదిరెడ్డి తన మిత్ర బృందంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు రమేష్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి స్వదేశాగమన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేష్ ముదిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా రమేష్ రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు వెంకన్న, కంచర్ల కృష్ణారెడ్డి, యడవెల్లి అఖిల్ రెడ్డి, శ్రీగిరి వెంకట మాధవరెడ్డి, రమేష్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

పెన్ పహాడ్ ప్రజా ముచ్చట మే 28:గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. మండల పరిధిలోని మాచారం గ్రామపంచాయతీ ఆవాస గ్రామం గుడిబండ తండాలో బుధవారం సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ సమగ్ర సంతులిత అభివృద్ధి తన ధ్యేయమని మండల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడి జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి...



**- మండల వ్యవసాయ అధికారి బానోతు అనిల్ కుమార్ నాయక్**

పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 28: వ్యవసాయశాఖ తరపున ఈ వానాకాలం సీజన్ కు సంబంధించి నేటి నుండిమండలంలోని ప్రాదమిక వ్యవసాయ సహకార సంఘం(అనంతారం) అధ్వర్యంలో రైతులకు పచ్చి రొట్టె పైరు విత్తనాలు అయినటువంటి జీలుగ విత్తనాలను సబ్సిడిపై పంపిణి చేయడం జరుగుతుందనీ మండల వ్యవసాయ అధికారి బానోతు అనిల్ కుమార్ నాయక్ బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన మండలమునకు 30 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రావడం జరిగినదని, 30 కేజీ ల జీలుగ విత్తనాల బస్తా పూర్తి ధర 4275 రూపాయలు కాగా ప్రభుత్వ సబ్సిడీ 50 శాతం రాయితీ పోను రైతు మిగిలిన 50 శాతం నగదు అనగా 2137 రూపాయలు చెల్లించాలని అన్నారు. మండలంలో జీలుగు విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని వచ్చి అనంతారం సొసైటీ కి వెళ్లి తీసుకోవాల్సిందిగా వారు తెలిపారు . పచ్చిరొట్ట జీలుగ (పచ్చిరొట్ట పైర్ల) ఉపయోగాలను వివరిస్తూ ఇవి భూమికి సేంద్రియ పోషకాలను అందిస్తుందని, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను అందిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుందని, పచ్చిరొట్ట జీలుగను పొలంలో వేసి కలియ దున్నడం వలన భూమి సారవంతం అవుతుందని అన్నారు. దీనివల్ల భూమి సారం పెరిగి దిగుబడులు పెరుగుతాయన్నారు. ఇది పంటలకు అవసరమైన పోషకాలను అందిస్తుంది. జీలుగ మొక్కలు నత్రజనిని శోషించుకుంటాయి. మరియు వాటి వేర్ల ద్వారా నత్రజనిని నేలకి అందిస్తాయి, ఇది పంటలకు అవసరమైన ఒక ముఖ్యమైన పోషకం అని అన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

# నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**- ప్రత్యేకాధికారి శంకర్**

పాలకవీడు,ప్రజాముచ్చటమే 28:రైతులకు నాణ్య మైన విత్తనాలనే అమ్మాలని, నాసిరకం విత్తనాలను అంటగట్టి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. పాలకీడు లోని పలు ఫర్టిలైజర్ షాపులను బుధవారం మండల అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన స్టాక్ రిజిస్టర్లు, రసీదులు, ఇన్వాయిస్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులు అధీకృత లైసెన్స్ డీలర్ల నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాల న్నారు. తప్పనిసరిగా రసీదు తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని, కొనుగోలు సమయంలో లాట్ నెంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకో వాలని రైతులకు సూచించారు. బీటీ-3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఆ విత్త నాలను విక్రయించినా, సాగు చేసినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా అలాంటి విత్తనాలు అమ్మితే తమకు సమాచారం అందించాలన్నారు.



డీలర్లు అందరూ కూడా ఎరువుల విక్రయాలు ఈపాస్ ద్వారా మాత్రమే కొనసాగించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి బి.కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఓ లక్మి, ఎస్ఐ లక్ష్మీ నరసయ్య లు పాల్గొన్నారు.

# యుద్ధం ఆపడానికి ఉక్రెయిన్ కు కండిషన్లు పెట్టిన పుతిన్

గత మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ భీకర పోరును ఆపేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే, ఇందుకు ఆయన పలు కఠినమైన షరతులు విధించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది.ఉక్రెయిన్ ఎట్టిపరిస్థితుల్లోనూ నాటో కూటమిలో చేరకూడదన్నది పుతిన్ ప్రధాన డిమాండ్‌గా ఉంది. నాటో విస్తరణను తక్షణమే నిలిపివేయాలని, ఈ మేరకు లిఖితపూర్వక హామీ ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. ఉక్రెయిన్‌తో పాటు జార్జియా, మోల్డోవా వంటి మాజీ సోవియట్ దేశాలకు నాటో సభ్యత్వం ఇవ్వకూడదని కూడా స్పష్టం చేసినట్లు సమాచారం. వీటితో పాటు, ఉక్రెయిన్ తటస్థంగా వ్యవహరించాలని, రష్యాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, స్తంభింపజేసిన రష్యన్ ఆస్తుల సమస్యను పరిష్కరించాలని, ఉక్రెయిన్‌లోని రష్యన్ మాట్లాడే ప్రజలకు రక్షణ కల్పించాలని పుతిన్ షరతులు విధించినట్లు రాయిటర్స్ తెలిపింది.మరోవైపు, శాంతి చర్చల ప్రతిపాదనలు వస్తున్నప్పటికీ రష్యా దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతంలో నాలుగు సరిహద్దు గ్రామాలను రష్యా సైన్యం స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కీలక ప్రతిపాదన చేశారు. పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు అంగీకారం కుదరకపోతే, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి త్రైపాక్షిక చర్చలకు తాను సిద్ధమని ఆయన ప్రకటించారు.

# పల్లెల్లో ప్రశాంత వాతావరణమే పోలీస్ ప్రజా భరోసా లక్ష్యం: డీఎస్పీ ప్రసన్నకుమార్

పెన్ పహాడ్/ ప్రజా ముచ్చట, మే 28:జిల్లా ఎస్పీ నరసింహ పోలీస్ ప్రజా భరోసా పేరుతో గ్రామాల్లో ప్రతి బుధవారం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సామాజిక అంశాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వారి ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ విచ్చేసి నారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమ లక్ష్యం అని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని పోలీసులు మీ భద్రత కోసమే ఉన్నారని అన్నారు. గ్రామాల్లో అలజడి వాతావరణం, సమస్యలు సృష్టించే వారిలో మార్పు తీసుకురావడం, సామాజిక సమస్యలను గుర్తించి వాటిని నిర్మూలించడం కోసం తద్వారా గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం ఈ కార్యక్రమం ఉద్దేశం అని అన్నారు. సమస్యాత్మక గ్రామంగా పోలీస్ రికార్డుల్లో ఒకసారి నమోదైతే ఎప్పటికీ అలాగే నిలిచిపోతుందని అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలను వేధించడం వంటివి కచ్చితంగా శిక్షార్హమైనవి ఇలాంటి విషయాలను పోలీసువారికి వెంటనే తెలియజేయవలెనని అన్నారు.






## ప్రజల సహకారంతోనే పోలీస్ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తుంది: ఎస్సై కస్తాల గోపికృష్ణ

అపరిచితులు ఫోన్, సోషల్ మీడియా ద్వారా, మెసేజ్ ల ద్వారా తెలిపితే నమ్మి అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవద్దని వివరించారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని, బెట్టింగులకు పాల్పడవద్దని సూచించారు. చదువుపై ఉద్యోగాలపై దృష్టి పెట్టాలని అన్నారు. రోడ్డు ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని అన్నారు. గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు గ్రామాల్లోకి రానివ్వ వద్దని, ఎవరైనా డ్రగ్స్ సేవిస్తున్నట్లుగా లేదా అమ్ముతున్నట్లుగా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై పక్కా నిఘా ఉంటుందని పేర్కొన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. పోలీసులు మిమ్మల్ని భయపెట్టే వారు కాదని మీరు నమ్మాల్సిన వారని అన్నారు . ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా పోలీసులను ఆశ్రయించండి.. మా పోలీస్ స్టేషన్ ద్వారాలు ఎప్పుడు ప్రజల కోసం తెరిచి ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ మురళీధర్ రెడ్డి , కానిస్టేబుల్ వంశీధర్ రెడ్డి , ప్రవీణ్, బాలకృష్ణ, నరేష్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు వేదికగా తండ్రిని గుర్తు చేసుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టి ప్రసంగించారు. ప్రతి మహానాడులో ఆఖరి తీర్మానంగా దీనిని ప్రవేశపెడతామని, గతంలో తన తండ్రి, టీడీపీ సీనియర్ నేత కింజరాపు ఎర్రన్నాయుడు ఇదే రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన అడుగుజాడల్లో ఈ అవకాశం తనకు కల్పించినందుకు టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఉగ్రవాదంపై ఉక్కుపాదం, దేశభక్తి మన విధానంపహల్గాం సంఘటన ప్రతి భారతీయుడినీ కలచివేసిందని, ఆ ఘటనలో 26 మంది మరణించగా, వారిలో ఇద్దరు తెలుగువారు ఉండటం బాధాకరమని రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దృఢ నిశ్చయంతో "ఆపరేషన్ సింధూర్" ద్వారా ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పారని, 81 మంది ఉగ్రవాదులను హతమార్చిన ఘనత భారత సైన్యానిదని, ప్రధాని మోదీదని కొనియాడారు. "ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగిసిపోలేదని, శాంతిని ప్రేమించే భారతదేశంలో అశాంతి సృష్టించాలని చూస్తే అదే వారికి చివరి రోజవుతుందని" ఉగ్రవాదులకు, వారిని ప్రోత్సహించే దేశాలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. టీడీపీ ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించినప్పటికీ, దేశభక్తితో పనిచేసిందని, రాష్ట్రానికి, దేశానికి ఉన్న సత్సంబంధాలను గౌరవించిందని తెలిపారు.కేంద్రంలో టీడీపీ కీలక పాత్ర, రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు ఎన్నో కూటములను కేంద్రంలో నడిపిన ఘనత టీడీపీదని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీ నాయకుడిని ప్రధాని చేయాలన్నా, ముస్లిం వ్యక్తిని రాష్ట్రపతి చేయాలన్నా, దళిత వ్యక్తిని లోక్‌సభ స్పీకర్‌గా చేయాలన్నా ఆ ఘనత టీడీపీకే దక్కిందన్నారు. 43 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రం అనుసంధానంగా ముందుకు వెళ్తోందని, ప్రస్తుతం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా రాష్ట్ర ప్రయోజనాలు, దేశ సమగ్రత కోసం పనిచేస్తున్నాయని వివరించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో, దేశంలో ఆటంకాలు లేని కూటమి పాలన సాగుతోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతి వంటి కీలక అంశాలను కేంద్రం ద్వారా ఏడాదిలోపే సాధించామని ఆయన తెలిపారు.దేశం రేపు ఆలోచించేది చంద్రబాబు ఇవాళే ఆలోచిస్తారుతెలుగువారి ఆత్మగౌరవం కోసం, పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల కోసం టీడీపీ ఆవిర్భవించిందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్టీఆర్ యువతను ప్రోత్సహిస్తే, నేడు చంద్రబాబు అదే మూల సిద్ధాంతంతో పార్టీలో యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రపంచంలోని వినూత్న విధివిధానాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని, "వాట్ సీబీఎన్ థింక్స్ టుడే... ఇండియా థింక్స్ టుమారో" అనేది నినాదంగా మారిందని కొనియాడారు. చంద్రబాబు పాలనలో ప్రజల వద్దకే పాలన, జన్మభూమి, డ్వాక్రా సంఘాలు, ఐటీ, జీనోమ్ వ్యాలీ వంటివి రూపుదిద్దుకున్నాయని, ఆయన ఏర్పాటు చేసిన జీనోమ్ వ్యాలీనే కోవిడ్ వ్యాక్సిన్ కనుగొనడంలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. దేశంలో విమానాశ్రయాల నిర్మాణంలో పీపీపీ విధానాన్ని, అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి చంద్రబాబు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. నదుల అనుసంధానం ఆయన జీవితాశయమని, వాజ్‌పేయి హయాంలో ప్రయత్నించి, నేడు మోదీకి ఆ విధానాన్ని చూపించడంతో ఆ కల సాకారం కాబోతోందని తెలిపారు.గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలుగత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు నరకం చూశారని రామ్మోహన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలుపెట్టి, మూడు రాజధానుల మాయతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిని అంతమొందించారని, "బాదుడే బాదుడు"తో ప్రజలపై భారాలు మోపారని, దళితులను ఇళ్లకే పరిమితం చేసి హత్యలు చేశారని ఆరోపించారు. అసెంబ్లీని బూతులకు వేదికగా మార్చారని, కేంద్ర నిధులు, ల్యాండ్, శాండ్, మైనింగ్, గిరిజన నిధుల్లో దోపిడీ చేశారని, కల్తీ మద్యం ద్వారా వేల కుటుంబాలను రోడ్డున పడేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి 56 రోజులు జైల్లో పెట్టడం జగన్ చేసిన పెద్ద తప్పని, ఆ చర్యతోనే ఆయన పతనం ప్రారంభమైందని అన్నారు. లోకేశ్ యువగళం, యువతకు ప్రాధాన్యంటీడీపీ చరిత్ర మరో 40 ఏళ్లు కొనసాగాలన్నది నారా లోకేశ్ ఆలోచన అని రామ్మోహన్ నాయుడు అన్నారు. యువత భయంతో బయటకు రాని పరిస్థితుల్లో, లోకేశ్ "యువగళం" పేరుతో పాదయాత్ర చేపట్టి, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా 3000 కిలోమీటర్లు పూర్తిచేశారని, ఇది దేశ చరిత్రలో యువతకు సరికొత్త స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. "ప్రజలకు నచ్చిన నాయకుడు, ప్రధాని మెచ్చిన నాయకుడు మన లోకేశ్ గారని, మంగళగిరిలో ఓడిపోయినా, పారిపోయే తత్వం తమది కాదని అక్కడే పోటీ చేసి 91,413 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారని" తెలిపారు. పార్టీలో 60 మందికి పైగా యువ ఎమ్మెల్యేలను చంద్రబాబు తయారుచేశారని, పార్లమెంట్‌లోనూ టీడీపీ యంగెస్ట్ పార్టీ అని, యువతను రాజకీయాల్లోకి ఎలా తీసుకురావాలో ఇతర పార్టీలకు టీడీపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు.కోటి సభ్యత్వాలను 45 రోజుల్లో పూర్తిచేయడం లోకేశ్ నాయకత్వ పటిమకు నిదర్శనమని పేర్కొన్నారు. లోకేశ్ ప్రతిపాదించిన "ఆరు శాసనాలను" ప్రజల్లోకి తీసుకువెళ్లి, మరో 40 ఏళ్లు పార్టీని ముందుకు నడిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు., తనకు కేంద్ర మంత్రి పదవి ఇచ్చినందుకు, మహానాడులో రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం కల్పించినందుకు చంద్రబాబు నాయుడుకు రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. సూర్యచంద్రులు ఉన్నంత కాలం టీడీపీ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

